వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
మంగళవారం 28 జూలై 2026



## సీపీఎస్ రద్దు పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం ఉద్యోగుల పోరుబాట

### కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు వినతిపత్రం అందజేత

కరీంనగర్, జూలై 27(వాయిస్ టుడే): కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానాన్ని తక్షణమే రద్దు చేసి,పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే ప్రధాన డిమాండ్‌తో తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'జన జాగరణ' కార్యక్రమం జోరందుకుంది.ఇందులో భాగంగా కరీంనగర్ శాసనసభ్యులు,మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు.ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సీపీఎస్ ఉద్యోగుల పక్షాన అసెంబ్లీలో గళం విప్పుతామని స్పష్టం చేశారు.వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో పోరాడుతామని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ జూలై 11న ప్రారంభించిన జన జాగరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పర్యటిస్తూ మొత్తం 119 మంది ఎమ్మెల్యేలను కలుస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2 లక్షల 60 వేల మంది సీపీఎస్ ఉద్యోగ,ఉపాధ్యాయుల ఏకైక ఆకాంక్ష పాత పెన్షన్ పునరుద్ధరణేనని తేల్చిచెప్పారు.ఎన్నికలసమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిందని,అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు.సీపీఎస్ విధానం వల్ల రిటైర్డ్ అయిన ఉద్యోగులకు కేవలం రూ.3,000 నుంచి రూ.4,000 మాత్రమే పెన్షన్ వస్తోందని,ఈ నామమాత్రపు మొత్తంతో దినసరి కుటుంబ పోషణ కూడా భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనాప్రభుత్వం స్పందించి, ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ వివిధ స్థాయిల ప్రతినిధులు,ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

### గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 17 ఫిర్యాదులు స్వీకరణ

### జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 27 (వాయిస్ టుడే): ప్రజల వద్ద నుండి ఫిర్యాదు లు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం లో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 17 ఫిర్యాదు లు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదు దారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదు దారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



## 19వ డివిజన్ లోరూ.15వ ఆర్థిక సంఘం నిధులతో మంచినీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన

### ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

### నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్,జూలై 27(వాయిస్ టుడే): నగర ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలను కల్పించే దిశగా నగరపాలక సంస్థ మరో కీలక అడుగు వేసింది. నగరపాలక సంస్థ 19వ డివిజన్ రేకుర్తి ప్రాంతంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న మంచినీటి పైపులైన్ పనులకు కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ తో కలిసి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, వేగంగా విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన తాగునీటిని ప్రతి ఇంటికి అందించేందుకు నగరపాలక సంస్థ పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని,రోడ్లు,డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్లు,వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో,నిర్ణీత గడువులోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు,స్థానిక కార్పొరేటర్ సుదగోని మాధవి కృష్ణ, కార్పొరేటర్లు పర్వతం మల్లేశం, గుగ్గిళ్ల జయశ్రీ ,మున్సిపల్ అధికారులు,ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు,డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# మత్తు రహిత యువతతోనే వికసిత్ భారత్ సాధ్యం

### నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్,జూలై 27(వాయిస్ టుడే):మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్య, నైపుణ్యం,క్రమశిక్షణ,దేశభక్తితో ముందుకు సాగే యువతే వికసిత్ భారత నిర్మాణానికి బలమైన పునాది అవుతుందని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన నశా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్ అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ యువత తమ జీవిత లక్ష్యాల సాధనలో ఎలాంటి పరిస్థితుల్లోనూ మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులు కాకూడదని సూచించారు.దేశ అభివృద్ధికి యువశక్తే ప్రధాన బలమని, యువత సక్రమ దిశలో పయనిస్తేనే భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుకుంటుందని అన్నారు.తాను కేవలం నగర మేయర్‌గా మాత్రమే కాకుండా ఒకప్పుడు నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్‌గా గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న యువకుడినని గుర్తు చేసుకున్నారు.సమాజానికి నిస్వార్థంగా సేవ చేసిన వారిని ప్రజలు ఎప్పటికైనా గుర్తించి గౌరవిస్తారని,అదే తన ప్రజా జీవితానికి పునాదిగా నిలిచిందని తెలిపారు.ప్రజల ఆశీర్వాదంతో చిన్న వయసులోనే కరీంనగర్ నగర మేయర్‌గా సేవ చేసే అవకాశం లభించడం తన వ్యక్తిగత విజయం కాదని,యువతపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు.ప్రతి యువకుడు సమాజం కోసం ఆలోచిస్తూ ముందుకు సాగితే నాయకత్వ అవకాశాలు సహజంగానే వస్తాయని అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో యువత పాత్ర అత్యంత కీలకమని మేయర్ పేర్కొన్నారు.అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలంటే విద్యతో పాటు నైపుణ్యం,క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవన విధానం,సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు,దేశభక్తి వంటి విలువలను ప్రతి యువకుడు అలవరచుకోవాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నశా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్ ఉద్యమం యువతను మాదకద్రవ్యాల వ్యసనానికి దూరంగా ఉంచి,వారి శక్తి,ప్రతిభ, సామర్థ్యాలను దేశ నిర్మాణంలో వినియోగించేందుకు ప్రారంభించిన మహత్తర కార్యక్రమమని వివరించారు. భారత అంతరిక్ష రంగంలో యువత సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ స్కైరూట్ ఏరోస్పేస్ యువ ఇంజినీర్ల ప్రస్థానాన్ని ఉదాహరణగా చెప్పారు. చిన్న కలతో ప్రారంభమైన వారి ప్రయాణం నేడు భారతదేశానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిందని,లక్ష్యంపై నమ్మకం,కష్టపడి పనిచేసే తత్వం,దేశంపై ప్రేమ ఉంటే ఏ యువకుడైనా అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలడని పేర్కొన్నారు.నేటి కళాశాల విద్యార్థులలోనే రేపటి శాస్త్రవేత్తలు, వైద్యులు,ఇంజినీర్లు, ఐఏఎస్ అధికారులు, పారిశ్రామికవేత్తలు,స్టార్టప్ వ్యవస్థాపకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారని అన్నారు.ఒక తప్పు అలవాటు జీవితాన్ని నాశనం చేస్తుందని,కానీ ఒక మంచి లక్ష్యం జీవితాన్ని మాత్రమే కాదు దేశ భవిష్యత్తును కూడా మార్చగలదని చెప్పారు.విద్యార్థులు తమ జీవితాన్ని మత్తుకు కాకుండా విజ్ఞానానికి, ఆవిష్కరణలకు, పరిశోధనలకు అంకితం చేయాలని పిలుపునిస్తూ,మత్తుకు దూరంగా ఉండండి.మీ లక్ష్యాలకు దగ్గరగా ఉండండి.సిగరెట్ కాదు.సైన్స్‌ను పట్టుకోండి. మత్తు కాదు.మేధస్సే మీ అసలైన శక్తి"అని ఉద్బోధించారు.ప్రతి విద్యార్థి తన తల్లిదండ్రులకు గర్వకారణంగా,సమాజానికి ఆదర్శంగా,దేశ అభివృద్ధికి తోడ్పడే బాధ్యతాయుత పౌరుడిగా ఎదగాలని ఆకాంక్షించిన మేయర్,కరీంనగర్ నగరంలో యువత అభివృద్ధి,నైపుణ్య వికాసం, సామాజిక చైతన్యానికి సంబంధించిన ప్రతి మంచి కార్యక్రమానికి నగరపాలక సంస్థ తరఫున ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



## దేశ రక్షణలో సైనికుల త్యాగాలు అమోఘం

### యువతలో దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందాలి

### నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ మరియు డా. ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహణ

కరీంనగర్,జూలై 27(వాయిస్ టుడే): దేశ రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ,తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టే భారత సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని, నేటి యువత వారిని ఆదర్శంగా తీసుకుని దేశభక్తి,క్రమశిక్షణ,సేవా భావాన్ని అలవర్చుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.కార్గిల్ విజయ్ దివస్ మరియు భారత మాజీ రాష్ట్రపతి,ప్రముఖ శాస్త్రవేత్త డా.ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో తీవ్ర ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్న జవాన్ల సేవలను కొనియాడారు.మైనస్ 3 నుండి మైనస్ 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల్లో,మంచు పర్వతాల మధ్య ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ భద్రత కోసం సైనికులు చేస్తున్న సేవలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని అన్నారు.2009లో తాను శ్రీనగర్, కార్గిల్ ప్రాంతాలతో పాటు లాల్ చౌక్‌ను సందర్శించినప్పుడు సీఆర్‌పీఎఫ్ జవాన్లపై జరిగిన రాళ్ల దాడులను ప్రత్యక్షంగా చూశానని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ--కాశ్మీర్‌లో పరిస్థితులు గణనీయంగా మెరుగుపడి, అభివృద్ధి మరియు శాంతి నెలకొన్నాయని పేర్కొన్నారు. భారతదేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రముఖ శాస్త్రవేత్త డా. ఏపీజే అబ్దుల్ కలాం చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. పోఖ్రాన్ అణు పరీక్షలతో ప్రపంచ వేదికపై భారత్ తన శక్తి సామర్థ్యాలను చాటిందని పేర్కొన్నారు.నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత సైన్యం సాంకేతికంగా మరింత బలోపేతమై దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో యువత పాత్ర అత్యంత కీలకమని,దేశాభివృద్ధికి ప్రతి యువకుడు బాధ్యతాయుతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎన్నం లక్ష్మి ప్రకాష్,కర్రే పద్మ అనిల్,గాజా రమా శివరాం,రిటైర్డ్ ఆర్మీ జవాన్లు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## యువతపై జరిగిన దమనకాండకు కారణం మీరే కాదా

### బండి మాటలు కోటలు దాటుతాయి కానీ యువకులపై జరిగిన దాడిపై మాట్లాడరు

### మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్




కరీంనగర్,27(వాయిస్ టుడే): బీజేపీ వైఫల్యం వల్లే నీట్ పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయి మా జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయని ధర్నా చేస్తే ధర్నా చేసిన యువకులపై నిర్దాక్షిణ్యంగా పోలీసులచే బాష్ప వాయువు,లాఠీ ఛార్జ్,పెల్లెట్ గన్స్ తో దాడి చేపించి వందలమంది యువకుల యువతుల తీవ్ర గాయాలకు కారణమైన మీరు బీజేపీ ప్రభుత్వంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ కుమార్ యువతకు ఏంసమాధానం చెపుతారని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రశ్నించారు.ఆవేశ పూరిత ప్రసంగాలతో యువతను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి వాడుకోవడం కాదు యువత న్యాయం కోసం పోరాటం చేసినప్పుడు చిత్తశుద్ధిని ప్రదర్శించాల్సిన అవసరం లేదా అని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. యువత కూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ప్రతి చిన్న విషయానికి ప్రభుత్వాన్ని నిందించే స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రశ్నా పత్రాల లీకులు తద్వారా పోటీ పరీక్షలు రద్దు తప్ప నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని ఎన్నడైనా ఆలోచించారా అని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. గ్రూప్ వన్ పరీక్షలతో పాటు అన్ని రకాల పోటీ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించి 70 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించినట్టు యువకులకు 21 సంవత్సరాలకే చట్టసభలకు వెళ్లే విధంగా బిల్లు రూపకల్పన చేయాలని, యువకులపై పెట్టిన క్రిమినల్ కేసులను ఎత్తివేయాలని,ఈ దాష్టీకానికి కారణమైన కేంద్ర ప్రభుత్వ పెద్దలు మోడీ,అమిత్ షా దేశంలోని యువతకు క్షమాపణలు చెప్పాలని ఇప్పటికైనా ఈ విషయంలో బండి సంజయ్ కుమార్ పెదవులు విప్పాలని నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ విలేఖరుల సమావేశంలో మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజొద్దీన్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి,జీడి రమేష్, ఎల్లారెడ్డి,మిర్యాల శ్రీధర్ రెడ్డి, షబానా మహమ్మద్ షెహన్నా, సాయిరాం,ముల్కల యోన,మాసుం ఖాన్,జిలుకర రమేష్,బత్తుల రాజ్ కుమార్,ఇమామ్,ఖలీల్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం ఢిల్లీలో గళమెత్తిన టీడబ్ల్యూజేఎఫ్

## జంతర్ మంతర్‌లో తెలంగాణ జర్నలిస్టుల ధర్నా

ఢిల్లీ/కరీంనగర్,జూలై 27(వాయిస్ టుడే): దేశవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పై తెలంగాణ జర్నలిస్టులు ఢిల్లీలో గళమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పాత్రికేయులు పార్లమెంటు సమీపంలోని జంతర్ మంతర్ లో పెద్ద ఎత్తున ధర్నా చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన "ఛలో పార్లమెంట్" పిలుపునందుకొని రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఢిల్లీ తరలివచ్చిన పాత్రికేయులు ధర్నాలో పాల్గొని సమస్యలపై గొంతెత్తారు.ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాను ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నాయకులు,ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు మారూఫ్ రజా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులందరి పక్షాన తెలంగాణ జర్నలిస్టులు ఢిల్లీలో పార్లమెంట్ వద్ద ధర్నా చేయడం అభినందనీయమని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పాత్రికేయుల సంక్షేమం,భద్రత,హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ముందుండి పోరాటం చేయడం గొప్ప విషయమని అన్నారు.ధర్నా కార్యక్రమంలో జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జర్నలిస్టులు కూడా ఈ ధర్నాలో పాల్గొని ఉద్యమానికి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.దేశంలోని ప్రతి పాత్రికేయుడి హక్కుల కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.ఈ సందర్భంగా జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్దరణ, రిటైర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం,జర్నలిస్టుల రక్షణ చట్టం, నేషనల్ మీడియా కమిషన్ ఏర్పాటు,జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పునఃసమీక్ష తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి,కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లకు అందజేశారు.ఈ ధర్నాలో ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఉపాధ్యక్షుడు లియాఖత్,సభ్యులు మాన్విక మిశ్రా,ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్,రాష్ట్ర నాయకులు కుంచం శ్రీనివాస్,కుడుతాడి బాపురావు,కే. రమాదేవి,జగదీశ్వర్,పద్మనాభ రావు,గాదె కరుణాకర్ రావు,సాడిగె గోపి,వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.




Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**